క్లుప్తంగా

కరుణించవయ్యా.. కాలభైరవ



విశేష అలంకారంలో శ్రీ కాలభైరవస్వామి

కడప కల్చరల్ : 'మమ్మల్ని కరుణించి పిల్లలను కాపాడాలి... కుటుంబాలను చల్లగా చూడాలి' అని కాలభైరవస్వామిని భక్తులు మొక్కుకున్నారు. కడప నగరం బాసట స్వచ్ఛంద సంస్థ దత్తత గ్రామమైన ఎంఎస్ కొట్టాలలోని శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవస్వామికి ఆదివారం అమావాస్య ఆషాఢ మాసం ముగింపు సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. నగరంతోపాటు సమీప గ్రామాలకు చెందిన ప్రజలు కూడా విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో నిండిపోయింది. అర్చకులు శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో అభిషేకం, అష్టోత్తరం తదితర పూజలు నిర్వహించారు. ఆలయ ప్రత్యేక పూజల్లో భాగంగా భక్తులు గుమ్మడికాయ దీపాలు వెలిగించి హారతులు ఇచ్చారు. అనంతరం హాజరైన భక్తులందరికీ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శ్రీ చౌడేశ్వరిమాతకు విశేష పూజలు



పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం ఎర్రముక్కపల్లెలోని శ్రీ చౌడేశ్వరీదేవికి ఆదివారం తొగట వీర క్షత్రియులు విశేష పూజలు నిర్వహించారు. వారి కులదైవమైన చౌడేశ్వరీమాత జన్మదినం సందర్భంగా మూలమూర్తికి ఉదయం విశేష అభిషేకాలు, అనంతరం కనుల పండువగా అలంకారం చేశారు. నగరంతోపాటు సమీప ప్రాంతాల్లోని తొగట వీర క్షత్రియులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చారు. అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు కొరముట్ల సుబ్బరాయుడు, హరిబాబు, కోశాధికారి మల్లికార్జున, కమిటీ సభ్యులు సుబ్బరాయుడు, గురవయ్య, సుదర్శన్, పుష్పాంగధ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ భజన బృందాలు, కమిటీ సభ్యులు స్థానిక ప్రజలతో కలిసి భజనలు చేశారు.

క్రీడలతో స్నేహభావం పెంపు



విజేతలతో ఎమ్మెల్యే మాధవిరెడ్డి

కడప స్పోర్ట్స్ : క్రీడల్లో పాల్గొనడం ద్వారా యువత మధ్య చక్కటి స్నేహభావం పెంపొందుతుందని కడప శాసనసభ్యురాలు ఆర్.మాధవిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని పోలీస్ పెరేడ్ క్రికెట్ మైదానంలో ధోని ట్రోఫీ–24 బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువకులు క్రీడల్లో రాణిస్తూ సమాజ శ్రేయస్సుకు కృషిచేయాలని సూచించారు. అనంతరం విజేతగా నిలిచిన అల్మాస్‌పేట జట్టుకు విన్నర్స్ ట్రోఫీ, రవీంద్రనగర్ జట్టుకు రన్నర్స్ ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో కడప నైట్ రైడర్స్ అధ్యక్షుడు తారీఖ్‌అలీ, టీడీపీ నాయకులు మన్సూర్‌అలీఖాన్, డాక్టర్ నజీముద్దీన్, జిలాన్, ఇంతియాజ్ అహ్మద్, నాసర్ అహ్మద్, గౌస్, జేకే యూత్ అధ్యక్షుడు పి.ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఆట-పాట



శిల్పారామంలో విద్యార్థులు, చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా ఖాజీపేటకు చెందిన వరల్డ్ డ్యాన్స్ అకాడమి చిన్నారులు, విద్యార్థులు తమ ఆటపాటలతో ఆకట్టుకున్నారు. పలు ప్రాచుర్యం పొందిన సినీ గీతాలు, జానపద పాటలకు హుషారు గొలిపే నృత్యాలు ప్రదర్శించారు. నృత్య ప్రదర్శనలకు పదేపదే తమ కరతాళ ధ్వనులతో ప్రేక్షకులు ప్రోత్సహించారు. శిల్పారామం ఏఓ శివప్రసాద్ రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మళ్లీ 'కళ' తప్పింది

- మరమ్మతులు చేసినా పరిస్థితి మొదటికే
- ప్రదర్శనలు లేక శిథిలమవుతున్న కళాక్షేత్రం



కళాక్షేత్రంలోని ప్రధాన వేదిక

కడప కల్చరల్ : కడప నగర నడిబొడ్డున కళా నిలయమైన కళాక్షేత్రం కళ తప్పింది. రెండేళ్ల క్రితం రూ.4 లక్షలు ఖర్చు చేసి మరమ్మతులు నిర్వహించినా ప్రదర్శనలు జరగక, నిర్వహణ లేక మళ్లీ క్రమంగా శిథిల స్థితికి చేరుకుంది. దీంతో సమస్యలు మళ్లీ మొదటికొచ్చాయి. కళకళలాడుతుండాల్సిన కళాక్షేత్రం బొత్తి ప్రదర్శనలు లేక కళావిహీనంగా మారింది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే గానీ చేసిన ఖర్చుకు ఫలం లభించదు. మరికొన్నాళ్లు ఇలాగే వదిలేస్తే ఈ భవనం పూర్తిగా శిథిలమయ్యే ప్రమాదముంది.

కడప నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రం

నగరం నడిబొడ్డున కళా ప్రదర్శనలకు కేంద్రంగా కడప నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రం ఉంది. నగరంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇలాంటి కళానిలయం మరొకటి లేదని చెప్పవచ్చు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చెన్నై రోడ్డులోని మున్సిపల్ ఆడిటోరియం శిథిలమై కూలిపోవడంతో అప్పట్లో ఈ కళాక్షేత్రాన్ని నిర్మించారు. కూలిపోయిన ఆ భవనం స్థానంలో మున్సిపల్ ఆడిటోరియాన్ని నిర్మించారు. కానీ అది కళాప్రదర్శనలకు అనువుగా లేకపోవడంతో.. ఓ మోస్తరు ప్రదర్శనలు చేసేందుకు కళాక్షేత్రంపైనే ఆధారపడుతున్నారు. కాలక్రమంలో దీనికి కూడా మరమ్మతులు అవసరం అయ్యాయి. ఈ విషయాన్ని 'సాక్షి' పలుమార్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చింది. వైఎస్ అవినాష్‌రెడ్డి ఎంపీ నిధుల నుంచి రూ.4 లక్షలతో మరమ్మతులను 2022 నాటికి పూర్తి చేశారు.

అద్దె.. అసలు సమస్య

మరమ్మతుల్లో భాగంగా సీలింగ్, వేదిక ఇరువైపులా గల నాలుగు మేకప్ గదులను ఆధునీకరించారు. మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం కూడా అందుబాటులోకి తెచ్చారు. పైకప్పు లైట్లు, ఫ్యాన్లు కూడా వినియోగంలోకి వచ్చాయి. చుట్టూ గోడలకు నవరసాలు, కళారూపాలు, జిల్లా నాయకులు, ప్రముఖుల పెయింటింగ్‌లను వేయించారు. దీంతో కళాక్షేత్రం ఆకర్షణీయంగా మారింది. దీని నిర్వహణను పౌరసంబంధాలశాఖ నుంచి తప్పించి నగర పాలక సంస్థకు అప్పగించారు. రూ. 2–3 వేలుగా ఉండిన అద్దెను ఏకంగా రూ.8–10 వేలకు పెంచారు. మైకులు, కరెంటు చార్జీలు, రవాణా, ఇతర ఖర్చులు కలిపి మొత్తం ఒక్కో ప్రదర్శనకు రూ.10 వేలకు పైగా వెచ్చించాల్సి వస్తోంది. ఫలితంగా కళా సంస్థలేవీ ప్రదర్శనకు ముందుకు రావడం లేదు. ఏడాదికి నాలుగైదు వ్యాపార ప్రదర్శనలు మినహా కళాక్షేత్రం దాదాపు వెలవెలబోతూనే ఉంది.

నిర్వహణ లోపం

కళాక్షేత్రానికి మరమ్మతులు చేసి కేవలం రెండేళ్లవుతున్నా.. నిర్వహణ లోపంతో మళ్లీ సమస్యల నిలయంగా మారింది. ఇందుకు నిర్వహణ లోపమే ప్రధాన కారణమని కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారిగా అద్దెను భారీగా పెంచడంతో కళా సంస్థలు ముందుకు రాలేకపోతున్నాయి. దీంతో నిర్వహణ ఖర్చు నగర పాలక సంస్థపై పడింది. నిర్వహణలేమితో కళాక్షేత్రం నానాటికీ మట్టి కొట్టుకునిపోతోంది. విలువైన సోఫాలు, కుర్చీలు చిరిగి, విరిగిపోయి పనికి రాకుండా మారాయి. చాలా కుళాయిలు కనిపించడం లేదు. గ్రీన్ రూములు కూడా మట్టితో నిండి ఉన్నాయి. బయట, లోపల చప్పట బండలు కూడా పలుచోట్ల కుంగిపోయాయి. మైకు ఏరియాలో కూడా టైల్స్ పగిలిపోయాయి. పడమర వైపు ఖాళీ ప్రదేశం పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోయి చెత్త డంప్‌గా మారి అడవిని తలపిస్తూ దోమలకు నిలయంగా మారింది. పగలు కూడా పట్టుమని పది నిమిషాలు అక్కడ నిలుచొలేని పరిస్థితి నెలకొని ఉంది. ఈ సమస్యలు ఉండడంతోనే రెండేళ్ల క్రితం రూ.4 లక్షలు ఖర్చు పెట్టారు. కానీ పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఇందులో మొన్నటివరకు స్వచ్ఛంద టూరిజం సంస్థ కార్యాలయం ఉండేది. వారు తరుచూ సమావేశాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండడంతో కళాక్షేత్రాన్ని శుభ్రంగా ఉంచుకునేవారు. ఇప్పుడు నెలల తరబడి లోనికివెళ్లే వారే లేక పూర్తిగా దుమ్ముకొట్టుకుపోయి ఉంది. నిర్వహణ కోసం తిరిగి ఆ సంస్థకు ఇవ్వడమో, వాచ్‌మెన్, స్వీపర్లను నియమించడమో చేయకుంటే మూడు నాలుగు నెలల్లోనే శిథిలమయ్యే ప్రమాదముంది.



పగిలిన చప్పట బండలు



కళాక్షేత్రంలో ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు



విరిగిన కుర్చీలు, చిరిగిన సోఫా

పర్యాటక సమాచార కేంద్రంగా మార్చాలి



కళాక్షేత్రంలో టూరిజం సంస్థకు చోటు కల్పించి దాన్ని జిల్లా (పర్యాటక) సమాచార కేంద్రంగా మార్చవచ్చు. వాచ్‌మెన్, స్వీపర్ లేకుంటే ఇలా మరింత శిథిలమయ్యే ప్రమాదముంది. ఇటీవల మరమ్మతుల కోసం ఖర్చు చేసిన రూ. 4 లక్షలు వృథా కాకుండా చూడాల్సి ఉంది.

– ఆళ్లూరి వెంకటయ్య, అధ్యక్షుడు, సవేరా ఆర్ట్స్ అకాడమి, కడప

నామమాత్రపు అద్దెకు ఇస్తే పూర్వవైభవం



జిల్లా ప్రధాన కేంద్రమైన కడప నగరంలో కళా ప్రదర్శనలకు అనువైన ఒక్క థియేటర్ కూడా లేకపోవడం దురదృష్టకరం. రూ.4 లక్షలు ఖర్చు చేసినా కళా ప్రదర్శనలకు అందుబాటులో లేకపోవడం బాధాకరం. రిజిష్టర్ సంస్థలకు నామమాత్రపు అద్దెకు ఇస్తే కళకళలాడుతుంది.

– రమణయ్య, సీనియర్ రంగస్థల కళాకారులు, కడప

మంత్రికి యూనియన్ నాయకుల వినతులు



మంత్రికి సమస్యలను తెలియజేస్తున్న సీపీఐ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరానికి వచ్చిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఆదివారం పలు యూనియన్ల నాయకులు వినతి పత్రాలను సమర్పించారు.

■ కడప డిపోలో డ్రైవర్లకు నైట్ అవుట్లు కలపడం లేదని ఏపీ పీటీడీ కార్మిక పరిషత్ నాయకులు కోరారు. ఈ మేరకు మంత్రి స్పందిస్తూ అతి త్వరలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి పురుషోత్తం, కడప డిపో గౌరవాధ్యక్షులు చెట్టుబోయిన సుబ్బరాయుడు యాదవ్, రైతు సంఘం నాయకులు శివారెడ్డి, జోనల్ చైర్మన్ పీవీఎస్ నారాయణ, రీజినల్ చైర్మన్ యానాదిరాజు, కడప డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల కిశోర్‌బాబు, ఖాజాపీర్, నాయకులు చంద్రశేఖర్, మల్లికార్జున, రాధాకృష్ణ, బాల మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

■ పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఏఆర్ మూర్తి, జిల్లా అధ్యక్షులు బోసుబాబు తదితరులు పాల్గొన్నారు.

■ ఏపీఎస్ ఆర్టీసీలో పని చేస్తూ రిటైర్డ్ అయిన కార్మికులకు జీవనభృతి కల్పించాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ ఎల్.రఘునాథరెడ్డి, అధ్యక్షులు రాజేంద్రప్రసాద్‌లు పాల్గొన్నారు.

■ కడప నగరంలో సిటీ బస్సులను నడపాలని, ఆర్టీసీ బస్టాండు ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలని సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ కోరారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి మద్దిలేటి, కార్యవర్గ సభ్యులు మనోహర్‌రెడ్డి, మల్లికార్జున, భాగ్యలక్ష్మి, రాముడు తదితరులు పాల్గొన్నారు.

■ ఆర్టీసీలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీఎస్ ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ గంగాంజనేయులు కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు విజయ్, శివశంకర్, చిన్నయ్య, సీఆర్ రెడ్డి, శ్రీనివాసులు, సాయికుమార్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నాట్యమయూరి యామినికి నివాళి



యామిని కృష్ణమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం సిబ్బంది

కడప కల్చరల్ : మన పొరుగున ఉన్న అన్నమయ్య జిల్లాకు చెందిన ప్రఖ్యాత నర్తకీమణి, నాట్యమయూరిగా పేరుగాంచిన యామిని కృష్ణమూర్తి దేశ విదేశాలలో కూడా మన ప్రాంత పేరు ప్రఖ్యాతులను ఇనుమడింపజేశారని సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి అన్నారు. ఆదివారం బ్రౌన్ కేంద్రంలో యామిని కృష్ణమూర్తి చిత్రపటం వద్ద పూలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం యామిని కృష్ణమూర్తి ఢిల్లీలో కన్నుమూశారని, ఆమెకు బాల్యం నుంచే నాట్యంపై మక్కువ ఎక్కువని, 17వ యేటనే మద్రాసులో తొలి ప్రదర్శన ఇచ్చారని తెలిపారు. ప్రత్యేకంగా తన పేరిట డ్యాన్స్ స్కూలును ఏర్పాటు చేసి వేలాది మందికి నృత్యంలో శిక్షణ ఇచ్చారని తెలిపారు. ఆమె ప్రతిభను కొనియాడుతూ ప్రభుత్వాలు పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ అవార్డులు అందజేశాయన్నారు. టీటీడీ దేవస్థాన అస్థాన నర్తకీగా కూడా ఆమె సేవలు అందించారని తెలిపారు. క్షీరసాగర మథనం అనే నృత్య నాటకంలో విశ్వమోహినిగా అభినయించి మంచి పేరు గడించారన్నారు. కార్యక్రమంలో బ్రౌన్ కేంద్ర సహాయకులు జి.హరిభూషణరావు, జయశంకర్, సిబ్బంది నీలకంఠేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సేవా సమితి ఆధ్వర్యంలో అంత్యక్రియలు



వృద్ధుడి మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకుని వెళుతున్న కాశీ విశ్వనాథసేవాసమితి సభ్యులు

కడప అర్బన్ : కడప నగరంలోని చెమ్మామియాపేటలో నివాసం వుంటున్న రంగారావు కేశవులు (67) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయనకు ఎవరూ అంత్యక్రియలను నిర్వహించేవారు లేకపోవడంతో.. అతని మేనల్లుడి విజ్ఞప్తి మేరకు శ్రీ కాశీ విశ్వనాథసేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కాశీవిశ్వనాథ సేవాసమితి సభ్యులు ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, ఆర్టీసీ రిటైర్డ్ డీఎం నాగుల రాంప్రసాద్, రెడ్డి లక్ష్మణ్, పురుషోత్తం, దామోదర్, పౌరసరఫరాల సంస్థ సురేష్, రాఘవేంద్ర, మధు, టైలర్ రవి పాల్గొన్నారు.

మెసెంజర్లకు అరియర్స్ ఇవ్వాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : గ్రామీణ బ్యాంకుల్లో పని చేస్తున్న మెసెంజర్లకు అరియర్స్ ఇవ్వడంలో జరిగిన జాప్యం గురించి ఏపీ హైకోర్టు తీర్పును అమలు చేయకపోవడం దారుణమని బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.వెంగళరెడ్డి అన్నారు. ఏపీ హైకోర్టు అరియర్స్ ఇవ్వాలని ఆదేశించడంపై యాజమాన్యాన్ని అడగడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. దీనిపై వారు ఎటువంటి స్పందన కనిపించడం లేదని, అందుకు పోరాటమే మార్గమని తెలిపారు. అరియర్స్‌కు అర్హులైన మెసెంజర్లందరూ సంఘీభావంగా, అవసరమైతే ధర్నాలు, సమ్మెకు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ విషయంగా బీఎంఎస్ ఎప్పుడూ తోడ్పాటు అందిస్తుందని ఆయన వివరించారు. మన హక్కులు మనమే సాధించేందుకు అందరూ ఐక్యంగా ముందుకు రావాలన్నారు.

తక్కువ ఖర్చుతో ఆరోగ్యం

కడప ఎడ్యుకేషన్ : ఆక్యుపంక్చర్ వైద్యంతో తక్కువ ఖర్చుతో మన ఆరోగ్యం సొంతం అవుతుందని కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి అన్నారు. మొల్లప్రభ వారి సౌజన్యంతో జీబి హెల్త్ అండ్ వెల్‌నెస్ సంస్థ వారి నిర్వహణతో ఆదివారం కడప గురుకుల విద్యాపీఠ్ స్కూల్ వద్ద ఉచిత ఆక్యుపంక్చర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సంబంధిత ఆక్యుపంక్చరీ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే మాధవిరెడ్డి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో మైగ్రేన్, పక్షపాతం, జీర్ణ సమస్యలు, నరాల బలహీనత మొదలకు వ్యాధులకు పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెడియోగ్రఫీ, అత్యాధునిక మందులతో నయంకానీ వ్యాధులు ఆక్యుపంక్చర్ ద్వారా నయమవుతాయన్నారు. డాక్టర్ గిరీష్ వైద్య సేవలు అభినందనీయం అని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరిప్రసాద్, పిచ్చయ్యచౌదరి, ఏవీఆర్ విద్యాసంస్థల అధినేత వేంకటేశ్వర్లు, సీఈఓ వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

కడప కార్పొరేషన్ : సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్/సెక్రటరీల సమస్యలను పరిష్కరించాలని గ్రామ వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు రాష్ట్ర క్రీడా రవాణా యువజన శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డికి విన్నవించారు. ఆదివారం కడప ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో వారు మంత్రిని కలిశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కృపాకర్, కార్య వర్గ సభ్యులు ప్రకాష్ రావు, శివ, కులయప్ప తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం

పెండ్లిమర్రి : సుప్రీం కోర్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పురాడంతో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద నుంచి ర్యాలీగా వచ్చి అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళి అర్పించారు.

ఏకలవ్య సేవలు మరింత చేరువ కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏకలవ్య ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్ : వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థిని, విద్యార్థులకు ఏకలవ్య ఫౌండేషన్ సేవలు మరింత చేరవ కావాలని ఫౌండేషన్ గౌరవ సలహాదారు గునిశెట్టి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం కడపలోని స్థానిక సంస్థ కార్యాలయంలో కమిటీ ముఖ్య సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లల్లో దాగి ఉన్న అనేక కళలు, నైపుణ్యాలు పదును పెట్టే సహ పాఠ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. తద్వారా వారి విద్యాభివృద్ధికి సంస్థ సభ్యులు, ఉపాధ్యాయుల సహకారంతో ఎంపిక చేసిన పాఠశాలల్లో చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఇవి మరింత చేరువ కావాలని, అందుకు సేవా భావంతో సభ్యులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సంస్థ విద్యా సమన్వయకర్త సుదర్శన్, ప్రాజెక్టు మేనేజర్ ఎన్విత, సభ్యులు ఉపాధ్యాయులు బాలాజీ, వెంకట్రామిరెడ్డి, ఆంగ్ల రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వర్లు, వరప్రసాదరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవ పోటీలకు విశేష స్పందన



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కడప కల్చరల్ : బాలోత్సవం కడప శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రెండు విభాగాలుగా నగరానికి చెందిన విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. స్థానిక ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో కడప ఎంఈఓ గంగిరెడ్డి ఈ పోటీలను ప్రారంభించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీ నిర్వహించామని తెలిపారు. చిత్రలేఖన పోటీకి 349 మంది, వ్యాసరచనకు 299 మంది 74 పాఠశాలల నుంచి హాజరయ్యారని సంస్థ అధ్యక్షులు గోపాల్, సలహాదారు వీర సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పోటీలకు విశేష స్పందన లభించడం తమకెంతో ఉత్సాహాన్ని కలిగించిందని వారు పేర్కొన్నారు. తరుచూ పోటీలను నిర్వహిస్తామని, స్వాతంత్ర్య దినోత్సవం నాడు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాజశేఖర్ రాహుల్, సునీత, కోటా మృత్యుంజయరావు, దేవదత్తం, బాల యల్లారెడ్డి, సుందరయ్య, వెంకటేశ్వర్లు, అరుణ, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విరాట పర్వపఠనం

పులివెందుల టౌన్ : స్థానిక శ్రీపద్మావతి సమేత వేంకటరమణస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విరాటపర్వ పఠనాన్ని భక్తిశ్రద్ధలతో చదివి వినిపించారు. సకాలంలో వర్షాలు కురవాలని గత నెల 6వ తేదీ నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు విరాట పర్వ పఠనం నెలరోజులపాటు పులివెందుల శ్రీమద్భాగవత ధర్మప్రచార ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ విరాటపర్వ పఠనంలో పలువురు వక్తలు, వ్యాఖ్యాతలు పఠనం చదివి వినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విరాట పర్వ పఠనం వల్ల సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సకాలంలో పండి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉంటారన్నారు. ఆదివారం విరాట పర్వం పఠనాన్ని కెకె కొట్టాల సర్పంచ్ శ్రీరంగనాథ, శేషయ్యలు చదివి వినిపించారు. విరాటపర్వ పఠనం ముగియడంతో పలువురు వక్తలు, వ్యాఖ్యాతలు, ప్రముఖులను ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

- కడప వాసి మృతి

హుకుంపేట (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలంలోని గడుగుపల్లి వద్ద ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అరకు అందాలను తిలకించేందుకు కడపకు చెందిన చమర్తి ఉపేంద్ర వర్మ(44) ఏజెన్సీకి వచ్చారు. అక్కడి నుంచి ఆయన బైక్‌పై పాడేరు బయలుదేరారు. మండలంలోని పాతకోట పంచాయతీ పనసపుట్టుకు చెందిన చెట్టి చందు, రామన్న బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నారు. ఎదురెదురుగా వస్తున్న వీరిద్దరి బైక్‌లు గడుగుపల్లి వద్దకు వచ్చేసరికి ఢీకొన్నాయి. దీంతో ఉపేంద్ర వర్మ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. గాయపడిన చందు, రామన్నను స్థానికులు పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పాడేరు ఆస్పత్రికి తరలించారు.



పచ్చని పుడమికి చీరకట్టినట్టు

ఎటు చూసినా పచ్చని తోటలు, పంట చేలు.. పంటను కాపాడుకోవడానికి చేను చుట్టూ కట్టిన రంగు రంగుల చీరెలు కనువిందు చేస్తున్నాయి. పచ్చని పుడమికి చీర కట్టినట్లు స్ఫురిస్తున్నది. బైపాస్‌లో వెళ్లేవారు వీటిని ఆసక్తిగా గమనిస్తున్నారు. ఖాజీపేట సమీపంలోని కొత్త నెల్లూరు గ్రామం వద్ద అ దృశ్యాలను 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– కడప కార్పొరేషన్